పట్టణాభివృద్ధికి సహకరించండి

- ఫ్యూచర్ సిటీకి కేంద్రం మద్దతు కావాలి
- గుజరాత్ తరహాలోనే తెలంగాణకు నిధులివ్వండి
- డిసెంబర్ 9న 'రైజింగ్ తెలంగాణ విజన్ 2047 డాక్యుమెంట్' ఆవిష్కరణ
- ప్రాంతీయ అర్బన్ డెవలప్‌మెంట్ సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పట్టణాభివృద్ధికి కేంద్రం సహకరించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కోరారు. భారత్ ఫ్యూచర్ సిటీకి సైతం సహకరించాలన్నారు. గుజరాత్ రాష్ట్రానికి ఇచ్చినట్లే తెలంగాణ రాష్ట్రానికి నిధులను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రతిష్టాత్మకమైన భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం, మెట్రో రైల్ విస్తరణకు వెంటనే అనుమతులివ్వాలని కేంద్రాన్ని కోరారు. మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ దిశగా రాష్ట్రం ముందుకు సాగుతున్నదని, అందులో భాగంగా డిసెంబర్ 9న రైజింగ్ తెలంగాణ విజన్ -2043 డాక్యుమెంట్' ఆవిష్కరించనున్నట్టు సిఎం తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రాంతీయ అర్బన్ డెవలంప్‌మెంట్ సమావేశంలో సిఎం మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్రం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తేనే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 30 వేల ఎకరాలతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్టు ఈ సందర్భంగా సిఎం వివరించారు. దేశంలో అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. 2047 వరకు మూడు ట్రిలియన్ల ఎకానమీ లక్ష్యంగా పని చేస్తున్నట్టు చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థలో 10వ శాతం తెలంగాణ వాటా ఉండాలని చూస్తున్నట్టు తెలిపారు. మూడేండ్లలో ఎలక్ట్రిక్ బస్సులనే నడుపుతామన్నారు. అన్ని రాష్ట్రాలకు తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అందుకు కేంద్రం సహకారం ఉండాలని ఆకాంక్షించారు. ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తెలంగాణ కూడా భాగమవుతుందని తెలిపారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని చెప్పారు. కేంద్రం నిర్దేశించుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలో రాష్ట్రవాటా 10 శాతం ఉండాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. జిడిపిలో ప్రధానంగా ఐదు మెట్రోపాలిటన్ నగరాలైన డిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయని, కేంద్రం సహకరించకుంటే రాష్ట్రాలాభివృద్ధి కుంటుపడుతుందన ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ గుజరాత్ మోడల్ రూపొందించుకున్నట్టే తాము తెలంగాణ మోడల్ తీసుకొచ్చామని వివరించారు. ఆయన సబర్మతి నది ప్రక్షాళన చేపట్టినట్టే తాము మూసీ పునరుజ్జీవం చేయబోతున్నట్టు చెప్పారు. అభివృద్ధి కోసం కేంద్రాన్ని కోరుతామని, ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, గుజరాత్ మంత్రి కనుభాయ్ మోహన్‌లాల్ దేశాయ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విదేశీ పత్తి దిగుమతికి మోడీ ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని నరేంద్రమోడీ అమెరికా అధ్యక్షుడితో ఆ దేశ పత్తిని దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకొని ఇక్కడి రైతులను మోసం చేస్తున్నారు.. ప్రభుత్వరంగ సంస్థ అయిన సిసిఐ ద్వారా కొత్త నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. బిఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో కెటిఆర్ పాల్గొన్నారు.. వరంగల్ జిల్లాలోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను హరీశ్‌రావు సందర్శించారు. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ.. దేశంలో ఐదు రాష్ట్రాల్లో అత్యధికంగా పత్తి పండిస్తారని తెలిపారు. ఎక్కడా లేని నాణ్యమైన పత్తి భారత దేశంలోనే పండుతుందని, తెలంగాణ రాష్ట్ర పత్తికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. ఇక్కడి పత్తిని ఎగుమతి చేసే రైతులకు న్యాయం చేయాల్సిందిపోయి విదేశాల నుంచి జీరో టారిఫ్‌తో దిగుమతి చేసుకునేందుకు ప్రధాని మోడీ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పత్తి కొనుగోళ్లపై ఆంక్షలు ఎత్తేయాలి : జాన్‌వెస్లీ

- నేడు, రేపు పత్తి మార్కెట్లలో సిపిఎం బృందాల పర్యటనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తి కొనుగోళ్లపై సిసిఐ విధించిన ఆంక్షలను తక్షణమే ఎత్తేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పత్తి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధ, గురువారాల్లో తమ పార్టీ బృందాలు పత్తి మార్కెట్లలో సందర్శిస్తాయని ప్రకటించింది. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతులకు పిలుపునిచ్చింది. మంగళవారం ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. జిన్నింగ్‌మిల్లుల యజమానుల బంద్‌తో వ్యాపారులు, గుమాస్తాలు, కార్మికులు ఆందోళన చేస్తున్నారని, నిరవధిక బంద్ వల్ల పత్తి లోడ్లతో మిల్లుల వద్ద పెద్ద ఎత్తున వాహనాలు బారులు తీరి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అకాలవర్షాల నేపథ్యంలో అండగా ఉండాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయడాన్ని తప్పుబట్టారు. సమస్య పరిష్కారం కోసం రాష్ట్రంలోని ఎనిమిది మంది బిజెపి ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పత్తి తడిసిపోయిందని, సిసిఐ ద్వారా క్వింటాకు రూ.8100 మద్దతు ధర కేంద్ర ప్రకటించినా ఎక్కడా అమలు కావడంలేదని తెలిపారు. ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనాలనే నిబంధనను సిసిఐ ఏడు క్వింటాళ్లకు కుదించడం దారుణమని విమర్శించారు. 12 శాతం తేమ పేరుతో పంటను కొనుగోలు చేయకపోవడం అన్యాయమని, తీవ్ర చలి ఉన్న నేపథ్యంలో 12 శాతం లోపు తేమ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రోజుకో నిబంధన పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదని సూచించారు. మద్దతు దళారీల చేతిలో రైతులు నిలువుదోపిడీకి గురవుతున్నారని తెలిపారు. పెట్టుబడి కూడా రాక అప్పులపాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. కపాస్ కిసాన్ యాప్ సాంకేతిక సమస్యలతో స్లాట్లు బుక్ కాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తీరును వివరించారు. ఆ యాప్‌ను వెంటనే తొలగించాలని, పత్తి కొనుగోళ్లపై విధించిన ఆంక్షలను ఎత్తేయాలని డిమాండ్ చేశారు.



వైద్య రంగంలో సాంకేతిక మార్పులకు కృషి

- ఎస్ఐఎస్ సాఫ్ట్‌వేర్ ఎమ్‌డి మెల్కియస్ మంగళం
- ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్

వైద్య రంగంలో సాంకేతిక మార్పులకు కృషి చేస్తున్నట్లు ఎస్ఐఎస్ సాఫ్ట్‌వేర్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మెల్కియస్ మంగళం ఆంథోనీ తెలిపారు. ఈ సర్జికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (ఎస్ఐఎస్) అనుబంధ సంస్థ 25వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెల్కియస్ మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో ఆవిష్కరణాత్మక సాఫ్ట్‌వేర్ పరిష్కారాలు అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నామని చెప్పారు. అంబులేటరీ సర్జరీ సెంటర్లు (ఎఎస్‌సి), ఆసుపత్రులను మరింత స్మార్ట్‌గా చేయడానికి సహాయపడుతున్నాయని తెలిపారు. భారతదేశంలోని నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణుల ప్రతిభను సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నాణ్యతలో వినియోగించిన తొలి ఆరోగ్య సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఒకటిగా ఎస్ఐఎస్ సాఫ్ట్వేర్ ఇండియా ఉందన్నారు.



సంగీతస్వర శిఖరం సాలూరి రాజేశ్వరరావు

- ప్రముఖ సంగీత విద్యాంసులు శ్యామ్ సుందర్

ప్రజాశక్తి కల్చరల్

సాలూరి రాజేశ్వరరావు లలిత సినీ సంగీత స్వర శిఖరమని ఘంటసాల సంగీత కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ అయ్యగారి శ్యామ్ సుందర్ అన్నారు. వంశీ ఇంటర్నేషనల్ ఇండియా నిర్వాహణలో సాలూరి రాజేశ్వరరావు 103 వ జయంతి సందర్భంగా ప్రముఖ గాయని డాక్టర్ సుహాసిని ఆనంద్‌కు సాలూరి రాజేశ్వరరావు వంశీ జాతీయ పురస్కార ప్రదానం సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్యామ్ సుందర్ మాట్లాడుతూ భాషకు భావం సాలూరి తన స్వర రచనలో పొందుపరచిన మహా సంగీత విశ్వరూపం అన్నారు. ఆయన పెర పురస్కార గ్రహీత సుహాసిని సంగీతంలో పరిశోధన చేసి పిహెచ్‌డి పట్టా పొందిన విదుషీమణి అని అభినందించారు. జయ లక్ష్మీ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ వంశీ సంస్థ ఎందరో పేరు పొందిన కళాకారులను సత్కరిస్తూ సంస్కారం చాటుకుంటోందని ప్రశంసించారు. వంశీ రామరాజు అధ్యక్షత వహించిన సభలో సంగీతజ్ఞుడు పాలగుమ్మి రాజ గోపాల్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఫణి నిర్వాహణలో సాలూరి సంగీత రచన చేసిన పలు పాటలు గాయనీ గాయకులు మధురంగా ఆలపించారు.

అతిపెద్ద 3డీ కాంక్రీట్ ప్రింటెడ్ మిలిటరీ ఇన్సిగ్నియా ఆర్చ్ ఏర్పాటు



హైదరాబాద్ : నగరానికి చెందిన డీప్‌టెక్ సంస్థ అయిన సింప్లిఫోర్జ్ ఐఐటి హైదరాబాద్‌తో కలిసి దేశంలోనే మొట్టమొదటి అతిపెద్ద మిలిటరీ ఇన్సిగ్నియా ప్రవేశ ద్వారాన్ని(ఆర్చ్) అభివృద్ధి చేసినట్లు సింప్లిఫోర్జ్ తెలిపింది. దీని కొలతలు 5.7 మీటర్ల పొడవు, 3.2 మీటర్ల వెడల్పు, 5.4 మీటర్ల ఎత్తు ఉన్నాయి. సింప్లిఫోర్జ్ కంపెనీకి చెందిన అత్యాధునిక రోబోటిక్ ఆర్మ్ ఆధారిత 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో దీన్ని నిర్మించినట్లు పేర్కొంది. పులి బొమ్మతో (టైగర్ థీమ్) ఉన్న ఈ ప్రవేశ ద్వారం కంటోన్మెంట్ లోపల ఉండే ఇండోర్ స్పోర్ట్స్ అరేనాలోకి దారి తీస్తుందని తెలిపింది. దీని నిర్మాణం, డిజైన్ అభివృద్ధిని ఐఐటి హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ కె.వి.ఎల్. సుబ్రమణియం, సింప్లిఫోర్జ్ కంపెనీ భాగస్వామ్యంతో చేపట్టారు. సింప్లిఫోర్జ్ ఫౌండర్ ఫైజాన్ చౌదరి ప్రాజెక్టు భాగస్వామిగా వ్యవహరించారు.

స్టార్టప్‌లకు మద్దతుగా యాక్సిస్ బ్యాంక్ ప్రోగ్రామ్

బెంగళూరు : ప్రయివేటు రంగ బ్యాంకింగ్‌లో ఒకటైన యాక్సిస్ బ్యాంక్ తమ న్యూ ఎకానమీ గ్రూప్ (ఎన్ఇజి) కింద క్యూరేటెడ్ కార్పొరేట్ శాలరీ ప్రోగ్రాం ఫర్ ఎంప్లాయీస్ ఆఫ్ స్టార్టప్స్‌ని ఆవిష్కరించినట్లు వెల్లడించింది. ఈ ప్రోగ్రాం అనేది ఫండెడ్ స్టార్టప్‌లు, డిజిటల్ వ్యాపార సంస్థల ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా తీర్చిదిద్దబడిందని యాక్సిస్ బ్యాంక్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వినయ్ మూల్‌బగల్ తెలిపారు. కొత్త తరం సంస్థలు, వాటి సిబ్బందికి అనువైన ఆర్థిక, లైఫ్‌స్టయిల్, వెల్‌నెస్ సాధనాలను అందిస్తూ, మద్దతుగా నిలవడంతో పాటు వృద్ధి దశ నుంచి ఐపిఒ వరకు స్టార్టప్‌ల జీవిత చక్రంలో వివిధ దశల్లో బ్యాంకింగ్ భాగస్వామిగా ఉండనున్నట్లు పేర్కొంది.

ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇద్దరి పిల్లల నిబంధన ఎత్తివేత ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉండకూడదన్న నిబంధనను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తొలగిస్తూ గవర్నర్ ఆమోదానికి పంపిన విషయం తెలిసిందే. తాజాగా గవర్నర్ ఈ ఫైల్‌పై సంతకం పెట్టడంతో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నా ....సర్పంచ్, వార్డ్ మెంబర్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో పోటీ చేయొచ్చు. 1994లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జనాభా నియంత్రణ లక్ష్యంగా ఈ నిబంధనను తీసుకొచ్చారు.



హైదరాబాద్‌లో రెండు కొత్త మిచెలిన్ సెంటర్లు ఏర్పాటు

హైదరాబాద్ : నగరంలో తన ఉనికిని బలోపేతం చేసుకోవడంలో భాగంగా రెండు కొత్త మిచెలిన్ టైర్స్ అండ్ సర్వీసెస్ స్టోర్లను ప్రారంభించినట్లు మిచెలిన్ ఇండియా తెలిపింది. వీటిని అశోక వీల్స్, 4 వీల్స్ అండ్ టైర్స్‌తో భాగస్వామ్యం వేరువేరుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఇందులో ఒక్కటి బంజారా హిల్స్, మరోటి కొల్లూర్ గ్రామంలో అందుబాటులోకి తెచ్చామని మిచెలిన్ ఇండియా నేషనల్ సేల్స్ మేనేజర్ ప్రశాంత్ శర్మ తెలిపారు.

సిఎం సమక్షంలో సిఒఎల్‌తో బిఆర్ఒయు ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ ఏర్పాటుకు కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ (సిఒఎల్)తో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి అవగాహన ఒప్పందం కుదిరింది. యూనివర్సిటీ ఈ అవగాహన ఒప్పందంతో ప్రముఖ డిజిటల్ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందనుంది. బోధన, అభ్యాసం, పరిశోధనలను మెరుగుపరచడానికి ఐడియా అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పనిచేస్తుంది. దీంతో యూనివర్సిటీ టెక్నాలజీ ద్వారా నాణ్యమైన విద్యను అందించనుంది. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలను బలోపేతం చేయడంతో పాటు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఒక నాలెడ్జ్ హబ్ గా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఒఎల్ అధ్యక్షులు పీటర్ స్కాట్‌కు తెలిపారు. ఈ సమావేశంలో కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షులు, సిఇఒ పీటర్ స్కాట్, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ ఘంటా చక్రపాణి, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మోడీ పాలనలో నిరుద్యోగం తీవ్రరం

- ప్రభుత్వ రంగ వ్యవస్థలన్నీ ధ్వంసం : జూలకంటి



డివైఎఫ్ఐ మహాసభలో మాట్లాడుతున్న జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని, ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ధ్వంసం చేశారని సిపిఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. 2026 జనవరి 18, 19, 20 తేదీల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరగనున్న డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభ సందర్భంగా మంగళవారం ఇబ్రహీంపట్నంలో ఆహ్వాన కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం చెందాయని అన్నారు. స్వప్రయోజనాల కోసమే ఇతర సంఘాలు పని చేస్తున్నాయని తెలిపారు. డివైఎఫ్ఐ దేశ సమగ్రతను కాపాడుతూ ముందుకు సాగుతున్నదని అన్నారు. ప్రజాతంత్ర ఉద్యమాల్లో అనేకమంది యువ కిశోరాలు ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద దేశంగా పేరుగాంచిన చైనా పారిశ్రామిక, వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధిస్తోందని అన్నారు. నిరుద్యోగం లేకుండా చేస్తున్నదన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆ ప్రయత్నం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రజాస్వామ్య పాలన సాగడం లేదని, ఇటీవల జరిగిన బీహార్ ఎన్నికల్లో అది బట్టబయలైందన్నారు. అడ్డదారుల్లో అధికారంలోకి వస్తున్న బీజేపీని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని యువతకు పిలుపునిచ్చారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలను తొలగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ పాలనలో చరిత్ర కనుమరుగవుతుందని, పాఠ్యాంశాలను సైతం మారుస్తూ యువతను అడ్డదారుల్లో నడిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. మితవాద ఉద్యమాలు ముందుకు వస్తున్న తరుణంలో డివైఎఫ్ఐ.. వాటిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం మతం పేరుతో విద్యారంగాన్ని విషపూరితం చేస్తోందని తెలిపారు. ప్రశ్న అనేది లేకుండా చేసే ఆలోచనగా దోపిడీ వర్గాలు ముందుకు వస్తున్నాయన్నారు. ప్రశ్నించే గొంతులను కనుమరుగు చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. ప్రపంచం సంక్షోభంలోకి వెళ్తోందని, యువత ఈ పరిణామాలపై నిరంతరం పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఏడాదికి 3.50 లక్షల మంది డిగ్రీ సర్టిఫికెట్లు పొందుతున్నారని, వారికి ఉద్యోగ, ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. ఇలాంటి తరుణంలో డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో నిర్వహించడం శుభ పరిణామమని తెలిపారు. అనంతరం ఆహ్వానకమిటీని ఎన్నుకున్నారు. ఆహ్వాన కమిటీ చైర్మన్‌గా ఆర్ వెంకట్రావ్, వైస్ చైర్మన్‌గా డి జగదీష్, కార్యదర్శిగా ఆనగంటి వెంకటేష్, కోశాధికారిగా పి జగన్, గౌరవ సలహాదారులుగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర, అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనంగంటి వెంకటేష్, జిల్లా కార్యదర్శి పి.జగన్, మాజీ జడ్‌పటిసి పి యాదయ్య, డీవైఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు కాడిగళ్ల భాస్కర్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సామెల్, ప్రకాష్ కరత్ పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్-2047 ఉత్సవాలు

- ప్రభుత్వ పాలసీలు ప్రకటిస్తాం
- బ్యాంకర్లు భాగస్వాములు కావాలి
- ఎస్ఎల్‌బిసి సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి



కార్యక్రమంలో మాట్లాడుతున్న భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైజింగ్-2047 ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఈనెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో నిర్వహించబోతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. అన్ని రకాల ప్రభుత్వ పాలసీలను ప్రకటిస్తామని చెప్పారు. ఈ భారీ కార్యక్రమంలో బ్యాంకర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని భాగస్వాములు కావాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని బేగంపేటలో ఓ ప్రయివేటు హోటల్‌లో నిర్వహించిన ఎస్ఎల్‌బిసి 47వ త్రైమాషిక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా 13 శాతం జిడిపి పెరుగుదల టార్గెట్‌గా తెలంగాణ రైజింగ్-2047 రోడ్ మ్యాప్‌ను విడుదల చేయబోతున్నట్టు వివరించారు. ఏటా పది శాతం చొప్పున పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యాన్ని సాధిస్తామని అన్నారు. తెలంగాణ అభివృద్ధి పట్ల ప్రభుత్వ కల ఏంటి, దాన్ని సాధించేందుకు ఎలాంటి ప్రణాళికలతో ముందుకు పోతున్నామనేది ఈ ఉత్సవంలో వివరిస్తామన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం, ఔటర్ రింగ్ రోడ్డుకు దాన్ని కలుపుతూ అనేక పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం, మూసీ పునర్జీవనం వంటి అంశాలను వివరించి ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడిదారు లను పెద్దఎత్తున ఆకర్షించబోతున్నామని చెప్పారు. బ్యాంకర్లు కార్పొరేట్ సంస్థలతోపాటు స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జి), సూక్ష్మ మధ్యతరహా, చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ రెండు రంగాలను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి లభించడంతోపాటు సంపద సృష్టించబడుతుందని, తద్వారా జిడిపి పెరుగుతుందని అన్నారు.

డిజిటల్ విద్య అందించడమే లక్ష్యం

విద్య, వైద్య రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని భట్టి చెప్పారు. బ్యాంకర్లు సిఎస్ఆర్ నిధులను సిఎస్ మొదలు కలెక్టర్ వరకు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిని సంప్రదించి ఈ రంగాల్లో ఆ నిధులను ఖర్చు చేయాలని సూచించారు. సదుపాయాలు కల్పించడంతోపాటు, డిజిటలైజ్ ఎడ్యుకేషన్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతుందని వివరించారు. వ్యవసాయ మౌలిక వసతుల నిధి కింద మంచి పురోగతి సాధించామన్నారు. తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిజంగా మార్పు చేయాలంటే పంట కోత తర్వాతి మౌలిక సదుపాయాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, సూక్ష్మ పంట నీరు, అనుబంధ రంగాల్లో బ్యాంకు రుణాలను మరింతగా పెంచాలని కోరారు. పంట రుణాలు సమర్థవంతంగా అందుతున్నప్పటికీ, వ్యవసాయ టర్మ్ లెండింగ్ అవసరానికి తగ్గట్టు లేదన్నారు. ఇది రైతులు ఆధునీకరించుకోవడం, వైవిధ్యం చేర్చుకోవడం, ఆత్మనిర్భర స్థాయి నుంచి సంపన్న స్థాయికి చేరడం సహాయపడదని చెప్పారు. ఈ లోటును బ్యాంకులు అత్యవసరంగా భర్తీ చేయాలని కోరారు. రూ. రెండు లక్షల వరకు పంట రుణ మాఫీ, రైతు భరోసా, సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. పామాయిల్‌తోపాటు ఇతర విభిన్న పంటలకు బ్యాంకులు ఎక్కువ మద్దతు ఇవ్వాలని సూచించారు. ఎంఎస్ఎంఈలు రాష్ట్రంలో ఉపాధి, ఆవిష్కరణలకు వెన్నెముకగా నిలుస్తున్నాయని చెప్పారు. భరోసాతో కూడిన, బలమైన ఎంఎస్ఎంఇ వ్యవస్థ వచ్చే దశాబ్దం తెలంగాణ రైజింగ్‌కు పునాది అని అన్నారు. 13 వేల కిలోమీటర్ల అంతర్గత రహదారుల నిర్మాణం, ఒక రూపాంతరక కార్యక్రమం ప్రస్తుతం జరుగుతోందని, ఇది రాష్ట్ర ఆర్థిక పటాన్ని సమూలంగా మారుస్తుందని చెప్పారు. దీన్ని బ్యాంకులు ప్రాధాన్య రంగ రుణ అవకాశంగా చూడాలని కోరారు. తెలంగాణ అభివృద్ధిలో బ్యాంకులు మరింత బలమైన పాత్ర వహించాలని సూచించారు. ఆత్మవిశ్వాసం, సమిష్టి కర్తవ్యంతో ఒక ఆధునిక, సమగ్ర, భవిష్యత్ తెలంగాణను నిర్మిద్దామని భట్టి పిలుపునిచ్చారు. తదుపరి దశాబ్దాన్ని తెలంగాణ చరిత్రలో అత్యంత రూపాంతరక కాలంగా మలుద్దామని అన్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాల మార్పు

- యూనియన్ పెట్టుకుంటే ఉద్యోగాలు పీకేస్తున్నారు
- పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలివ్వాలి
- వైద్య రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలి

: చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాల్లో మార్పులు తీసుకువచ్చారని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పిఎస్‌ఆర్ గార్డెన్‌లో మంగళవారం తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 4వ మహాసభ ప్రారంభమయింది. ముందుగా యూనియన్ జెండాను చుక్క రాములు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంపద సృష్టికర్తలు యజమానులే అని ప్రధాని మోడీ బరితెగించి మాట్లాడుతున్నారని, కానీ సంపద సృష్టికర్తలు మాత్రం కార్మికులేనని స్పష్టంచేశారు.



మహాసభలో మాట్లాడుతున్న చుక్క రాములు

కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చాక కార్మిక సంఘాలను బలహీన పర్చేలా.. యజమానులకు అనుకూలంగా చట్టాలను మార్చివేస్తున్నారని విమర్శించారు. విలువైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు అమ్మేస్తున్నదని అన్నారు.

ప్రమాదంలో ఉద్యోగ భద్రత..

కేంద్ర ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగుల స్థానంలో కాంట్రాక్టు వ్యవస్థను విశ్వవ్యాపితం చేయడంతోపాటు లేబర్ కోడ్స్ తీసుకురావడంతో ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడిందని చుక్క రాములు అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఒక్క రోజు వేతనం రూ.177 సరిపోతుందని కేంద్ర ప్రభుత్వం అంటుందని, నెలకు రూ.4770 ఎలా సరిపోతాయే కేంద్ర మంత్రులు, బిజెపి నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే, లేబర్ కోడ్స్ అమలులోకి రాకముందే యూనియన్ పెట్టుకున్నారని కార్మికులను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారని విమర్శించారు. బిస్లరీ వాటర్ కంపెనీలో ఉద్యోగులు యూనియన్ పెట్టుకున్నారనే సాకుతో ఐదుగురు యూనియన్ నాయకులను ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. వైద్య శాఖలో ఉన్న పర్మినెంట్, కాంట్రాక్టు ఉద్యోగులందరికీ వెంటనే పిఆర్‌సి ఇవ్వాలని, డిఎ బకాయిలు చెల్లించాలని తెలిపారు. అర్బన్ హెల్త్ సెంటర్ల ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని, ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేసే పేషంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ గాడ్స్ తదితరులకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాబోయే కాలంలో అనేక ఉద్యమాలు చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.భూపాల్, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఫసియొద్దీన్, యాదనాయక్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లిఖార్జున్, రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ, యూనియన్ కార్యదర్శి ఎం.యాదగిరి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీరం మల్లేశం, జి సాయిలు, వివిధ జిల్లాల అధ్యక్షకార్యదర్శులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంవి రమణ

28న సూర్యాపేటలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ

- వేలాదిమంది కార్మికులు తరలిరావాలి : ఎంవి రమణ
- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభ సందర్భంగా ఈ నెల 28న సూర్యాపేటలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ తెలిపారు. మహాసభకు రాష్ట్ర నలుమూలల నుంచి గీత కార్మికులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం కెజికెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉషాగొని వెంకట నర్సయ్య, ఇతర నాయకులతో కలిసి మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. బహిరంగ సభ అనంతరం 29, 30 తేదీలలో జరిగే ప్రతినిధుల సభలో గీత కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. 1957లో కల్లుగీత కార్మిక సంఘం ఏర్పడిందని తెలిపారు. ఈ 68 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించామని, సొసైటీలు, టిఎఫ్‌టిలు, పెన్షన్, ఎక్స్‌గ్రేషియా లాంటి కొన్ని హక్కులు సాధించుకున్నామని వివరించారు. మరెన్నో సాధించుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్న కల్లుగీత వృత్తి గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టింపేలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమానికి ఒక్క పథకం కూడా ప్రవేశపెట్టలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని తెలిపారు. అధికారులకు, మంత్రులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ.నాలుగు వేలకు, ఎక్స్‌గ్రేషియా రూ.పది లక్షలకు పెంచాలని, ప్రమాదాల నివారణకు వృత్తి చేసే వారందరికీ జాప్యం లేకుండా కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని కోరారు. ప్రమాదానికి గురైన గీత కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలని, నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ సురుగు రాజేష్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు అంబాల శ్రీనివాస్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి సట్ల ప్రభాకర్ గౌడ్, సహాయ కార్యదర్శి సుధాగని రమేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వర్కాల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



పిస్తా హౌస్ ఓనర్ ఇంటిపై ఐటి దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గోల్డెన్ యార్డ్స్ కాలనీలో పిస్తా హౌస్ ఓనర్ ఇంటిపై మంగళవారం ఐటి అధికారులు దాడులు నిర్వహించారు. ఓనర్‌తో పాటు డైరెక్టర్ల ఇంట్లోనూ ఏకకాలంలో 15 బృందాలుగా ఉదయం నాలుగు గంటల నుంచి తనిఖీలు ప్రారంభించారు. కొంతకాలంగా కోట్లలో పిస్తా హౌస్ వ్యాపారం జరుగుతున్నా ఐటీ మాత్రం తక్కువ మొత్తంలో చూపించడంతో ఐటి అధికారులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఓనర్‌తోపాటు డైరెక్టర్ల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. వారి ఇండ్లలో విలువైన డాక్యుమెంట్లను, బ్యాంకు లావాదేవీలను అధికారులు పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇందిరా గాంధీ సేవలు మరువలేనివి : సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సేవలు మరువ లేనివని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దేశ ప్రగతి, పేదల అభ్యున్నతి కోసం తన ప్రాణాలు అర్పించిన మహనీయురాలని కొనియాడారు. నేడు ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమెను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. తన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని తెలిసినప్పటికీ, దేశ సమగ్రత, సమైక్యత, పటిష్టత కోసం కఠిన నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగారని గుర్తు చేశారు. రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయీకరణ, 20 సూత్రాల కార్యక్రమం, అణు శక్తి అభివృద్ధి, గ్రీన్ రివల్యూషన్, మహిళా సాధికారత, భూ సంస్కరణలు వంటి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలతో దేశ ప్రగతికీ, పేదల అభ్యున్నతికి కృషి చేశారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ పాలనను ఆదర్శంగా తీసుకుని... పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఆమె పేరుతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని సిఎం చెప్పారు.

'లక్కీడ్రా' బంపర్ ఆఫర్

- రూ.2499కే 71 గజాల ఇల్లు అంటూ ప్రచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన ఇంటిని విక్రయించడం కోసం ఓ వ్యక్తి "లక్కీ డ్రా" పేరుతో బంపర్ ఆఫర్ ఇచ్చాడు. వివరాల్లోకి వెళితే.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో ఓ వ్యక్తి 71 గజాల్లో ఉన్న జీ ప్లస్-1 ఇంటిని కేవలం రూ.2499కే సొంతం చేసుకోవచ్చని మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు ఓ ప్రకటన బోర్డు ఏర్పాటు చేశాడు. ఈ లక్కీ డ్రాలో ఐదు రకాల బహుమతులు గెలుచుకోవచ్చని మొదటి బహుమతిగా ఇల్లు, రెండో బహుమతిగా హెూండా యాక్టివా స్కూటర్, 3 బహుమతిగా ఫ్రిడ్జ్, 4 బహుమతిగా వాషింగ్ మెషీన్, 5 బహుమతిగా స్మార్ట్ టీవీ ఆఫర్ ఉందని ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు నేరుగా కానీ ఆన్‌లైన్‌లో కానీ కొనుగోలు చేయాలని సూచించారు. ఈ లక్కీ డ్రాను వచ్చే ఏడాది జనవరి 26న తీస్తామని తెలిపారు. ఇటీవల యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ లోనూ ఇలాంటి ఘటనే జరిగింది. రూ.500 కూపన్‌తో ఇంటి స్థలాన్ని లక్కీ డ్రా పద్ధతిలో అమ్మగా.. ఓ చిన్నారి పేరున వచ్చిన విషయం విదితమే. అయితే, ఇలాంటి లక్కీ డ్రాల పేరిట రాష్ట్రంలో అక్కడక్కడా మోసాలు కూడా జరిగిన తెలిసిందే.

స్థానిక సంస్థలకు రూ. 4 వేల కోట్లు నిలుపుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగిసి 21 నెలలు దాటినా, రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను నిర్వహించకపోవడంతో పాలకవర్గాలు లేవని బిజెపి అధ్యక్షులు రామచందర్‌రావు చెప్పారు. దీని ఫలితంగా 15వ ఆర్థిక సంఘం నుంచి పంచాయతీలకు రావాల్సిన దాదాపు రూ. నాలుగు వేల కోట్ల నిధులు నిలిచిపోయాయని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి, పాలకవర్గాలను ఏర్పాటు చేసినప్పుడే ఆ నిధులు విడుదల అవుతాయన్నారు.

లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన అధికారులు

- మెదక్‌లో ఎస్‌ఐ, వనపర్తిలో విద్యుత్ శాఖ ఎఇ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కిన ఘటనలు మెదక్ జిల్లా టేక్మాల్, వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో మంగళవారం చోటుకున్నాయి. దొంగతనం కేసులో కాంప్రమైజ్ కోసం లంచం తీసుకున్న టేక్మాల్ ఎస్‌ఐని ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మెదక్ ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం హసన్మామపల్లి తండాకు చెందిన పాండు.. రాజస్థాన్‌కు చెందిన ఓ వ్యక్తి వరి కోసే మిషన్ నుంచి బ్యాటరీ, టూల్ కిట్స్ దొంగిలించడంతో అతనిపై కేసు నమోదు చేశారు. కాగా, ఈ కేసు విషయంలో కాంప్రమైజ్ చేస్తానని, కేసు మాఫీ చేస్తానని చెబుతూ నిందితుడు పాండు నుంచి ఎస్‌ఐ రాజేష్ ఫోన్ పే చేయించుకున్నాడు. ఆ డబ్బులు సరిపోకపోవడంతో, అదనంగా ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. దాంతో నిందితుడు పాండు ఎసిబి అధికారులను సంప్రదించాడు. మంగళవారం పాండు.. ఎసిబి అధికారులు ఇచ్చిన నోట్లతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐకు రూ.30 వేలు ఇచ్చాడు. ఇదే సమయంలో ఎసిబి అధికారులు ఎస్‌ఐ రాజేష్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడానికి ప్రయత్నించగా, స్టేషన్ వెనకాల నుంచి పారిపోయాడు. గమనించిన ఎసిబి అధికారులు.. రాజేష్‌ను వెంబడించగా.. టేక్మాల్ కూరగాయల మార్కెట్‌లో పట్టుబడ్డాడు. అనంతరం ఎస్‌ఐ రాజేష్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా.. లంచం తీసుకున్నట్టు ఒప్పుకున్నాడని ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ తెలిపారు. కాగా, ఎస్‌ఐ అరెస్ట్ విషయం తెలుసుకున్న మరికొంతమంది బాధితులు.. ఎసిబి అధికారుల ముందుకు వచ్చి తమ వద్ద నుంచి కూడా లంచాలు తీసుకున్నారని విన్నవించుకున్నారు. ఆధారాలతో వచ్చి తమకు ఫిర్యాదు చేస్తే వాటిపైన కూడా విచారిస్తామని ఏసీబీ అధికారులు హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించారు. అనంతరం బాధితులు, చుట్టుపక్కల గ్రామస్తులు.. స్టేషన్ ముందు టపాసులు పేల్చి.. ఆనందంతో కేరింతలు కొట్టి, నృత్యాలు చేశారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో ఓ రైతుకు ట్రాన్స్‌ఫార్మర్ కేటాయింపులో లంచం తీసుకుంటూ విద్యుత్ శాఖ ఎఇ ఎసిబికి పట్టుబడ్డారు. మహబూబ్‌నగర్ ఎసిబి డిఎస్‌పి సిహెచ్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్‌పేట మండల కేంద్రంలో విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఎన్ హర్షవర్ధన్ రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఏదుల మండల కేంద్రానికి చెందిన ఓ రైతు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కోసం ఎఇని సంప్రదించగా.. రూ.40 వేలు డిమాండ్ చేశారు. అందులో భాగంగా ముందుగా రూ. 20 వేలు, ట్రాన్స్‌ఫార్మర్ వచ్చిన తర్వాత మరో రూ. 20 వేలను ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. కాగా, మంగళవారం మధ్యాహ్నం బాధిత రైతు ఎఇ హర్షవర్ధన్ రెడ్డికి రూ.20వేలు ఇస్తుండగా.. ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎఇ హర్షవర్ధన్ రెడ్డిని బుధవారం నాంపల్లి కోర్టులో హాజరు పరచనున్నారు.



గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు యువత కృషి చేయాలి

- సైబర్ నేరగాళ్లు, బెట్టింగ్ యాప్‌లతో జాగ్రత్త : వెంకటేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యువత గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలని ఫలక్‌నుమా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్ అన్నారు. సైబర్ నేరగాళ్లు, బెట్టింగ్ యాప్‌లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హైదరాబాద్ జంగంమెట్ రవీంద్ర నాయక్‌నగర్ కాలనీ బంజారా వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో కాలనీ ప్రెసిడెంట్ ఇ కృష్ణ నాయక్ అధ్యక్షతన మంగళవారం బంజారా వెల్ఫేర్ కమ్యూనిటీ హాల్‌లో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. యువత గంజాయి, డ్రగ్స్ జోలికి వెళ్లకుండా భవిష్యత్‌ను అందంగా నిర్మించుకోవాలని సూచించారు. సమాజంలో మంచి పేరు తెచ్చుకుని ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. యువత చెడు దారి వైపు వెళ్లొద్దన్నారు. సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త ఉండాలని, బెట్టింగ్ యాప్స్ జోలికి వెళ్లొద్దని సూచించారు. అనగంటి వెంకటేష్ మాట్లాడుతూ.. ఎక్కువ శాతం యువకులు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల వైపు చూడకుండా మంచి భవిష్యత్ కోసం కలలు కని, దాన్ని సాధించుకోవాలని సూచించారు. ఉన్నత చదువులు చదివి సమాజ మార్పు కోసం ఆదర్శంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలక్‌నుమా ఎస్‌ఐ రాజేశ్వర్ రెడ్డి, కాలనీ పెద్దలు శంకర్ నాయక్, రాజేష్, సురేష్, రవి, సోమల, దాస్య, శంకర్, ఆంజనేయులు మోతిలాల్ చత్రువు శ్రీను రాజేష్ భరత్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న సిఐటియు నాయకులు

శ్రమ దోపిడీకి గురవుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

- బిఆర్‌ఎస్, కాంగ్రెస్ విధానాలు ఒక్కటే : పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మధ్యాహ్న భోజన కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగినా కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. భవిష్యత్తు పోరాటాల కాలమని, ఎర్రజెండా నాయకత్వంలో జరిగే పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని కామ్రేడ్ రంజన్ నిరులా నగర్‌లో జరుగుతున్న తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 4వ మహాసభ మంగళవారం కొనసాగాయి. ముందుగా యూనియన్ సీనియర్ నాయకులు వెంకట నర్సమ్మ జెండావిష్కరణ చేశారు. అనంతరం అమరవీరుల స్థూపానికి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటాలు కొనసాగుతాయని తెలిపారు. కార్మికుల పట్ల బీఆర్‌ఎస్, కాంగ్రెస్ విధానాలు ఒకటేనని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ కోత పెట్టడమే కాకుండా, పెండింగ్‌లో ఉన్న బిల్లులను సైతం విడుదల చేయడం లేదన్నారు. 'హామీలు ఫుల్.. అమలు నిల్' అన్నట్టుగా ప్రభుత్వాల వైఖరి కనిపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేయడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని అన్నారు. ఈ స్కీంను రక్షించుకునేందుకు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లాలో అక్షయపాత్రని అడ్డుకున్న ఏకైక సంఘం సిఐటియు మాత్రమేనని గుర్తు చేశారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు కడుపు నింపుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సైతం కాజేయాలని కేంద్రం చూస్తోందన్నారు. ఈ మహాసభలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ రమ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా అధ్యక్షులు రుద్రకుమార్, జిల్లా కోశాదికారి కవిత, జిల్లా ఉపాధ్యక్షులు కిషన్, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లేశం, వివిధ జిల్లాల నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

పార్టీ పరంగా వద్దు.. చట్టపరంగా ఇవ్వాలి

- బిసి రిజర్వేషన్లపై నమ్మించి మోసం : ఆర్ కృష్ణయ్య
- 21న నిరాహార దీక్షలు, కలెక్టరేట్ల వద్ద ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్లు పార్టీ పరంగా వద్దని, చట్టపరంగా రాజ్యాంగబద్ధంగా ఇవ్వాలని రాజ్యసభ సభ్యులు, రాష్ట్ర బిసి జెఎసి చైర్మన్ ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి బాణాల అజయ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. బిసి రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇస్తామని సిఎం, మంత్రులు, కాంగ్రెస్ అధ్యక్షులు పదే పదే ప్రకటించి ఏడాది కాలం నమ్మించి మోసం చేశారని, దీనికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు, ఎమ్మార్వో, ఆర్‌డిఒ కార్యాలయాల ఎదుట నిరాహార దీక్షలు, ధర్నాలు చేపడతామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లను ఇస్తామని క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఇది బిసిలను నమ్మించి మోసం చేయడమేనని విమర్శించారు. ఇక ముందు రాష్ట్ర ప్రభుత్వానికి, బీసీలకు మధ్య జరిగేది యుద్ధమేనని హెచ్చరించారు. ప్రభుత్వం మొదటి నుంచే వివిధ పార్టీల మద్దతు ద్వారా పోరాడితే సాధించే అవకాశం ఉండేదని, చిత్తశుద్ధితో ప్రయత్నం చేయలేదని అన్నారు. కాంగ్రెస్ నాయకత్వం వహించే ఇండియా కూటమికి లోక్‌సభలో 240 మంది ఎంపీలు ఉన్నా ఒక్క రోజూ పార్లమెంట్‌లో ప్రశ్నించలేదని, అలాగే ప్రధానిని కలిసి చర్చించలేదని అన్నారు. ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లో పార్టీపరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మార్చిలోపు ఎన్నికలు పూర్తి చేయకపోతే రూ.మూడు వేల కోట్లు వృథా అవుతాయని సిఎం అనడం సరైంది కాదని, రూ. మూడు వేల కోట్ల బడ్జెట్ కంటే రెండు కోట్ల మంది బిసి సమాజం ఎదురుచూస్తున్న బిసి రిజర్వేషన్లు ఎంతో ముఖ్యమని అన్నారు. హైకోర్టులో కేసు నెలలోపు పూర్తవుతుందని, ఆ లోపు అఖిలపక్షంతో కలిసి వెళ్లి ప్రధానితో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించొచ్చని సూచించారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బిసి యువజన, విద్యార్థి సంఘాల నాయకులు జి అనంతయ్య, సి రాజేందర్, రాజ్ కుమార్, భీమ్ రాజ్, పగిళ్ల సతీష్, మోడీ రాందేవ్, జి అంజి తదితరులు ఉన్నారు.

ఎర్రజెండాతో కలిసి నడుస్తాం..

- సిపిఎం నేత సామినేని హత్య దారుణం
- త్వరలో రామారావు కుటుంబ సభ్యులతో డిజిపిని కలుస్తా : కవిత



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎర్ర జెండాతో కలిసి నడుస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత అన్నారు. సిపిఎం నేత సామినేని రామారావు హత్య దారుణమని తెలిపారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గంలో మూడు రాజకీయ హత్యలు జరిగినా ఇప్పటివరకు నిందితులపై ఎలాంటి చర్యలూ లేకపోవడం శోచనీయమన్నారు. త్వరలో రామారావు కుటుంబ సభ్యులతో కలిసి డిజిపిని కలుస్తానని తెలిపారు. ఖమ్మంలోని ఓ ప్రయివేటు రెస్టారెంట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఖమ్మం జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉందని, తొలి ఉద్యమానికి ఊపిరిలూదిన జిల్లా ఇదని అన్నారు. మలిదశ ఉద్యమంలో కెసిఆర్‌ను కంటికి రెప్పలా కాపాడుకున్నారన్నారు. జలగం వెంగళరావు లాంటి మహనీయులను అందించిన జిల్లా అని, ఆయన తర్వాత జిల్లా అభివృద్ధి తుమ్మల నాగేశ్వరరావు వల్లే జరిగిందని తెలిపారు. తుమ్మల లాంటి నేతలు బయటకు వెళ్లడం వల్లనే బిఆర్‌ఎస్ ఓడిపోయిందన్నారు. 20 ఏండ్లు పనిచేసిన తనను కుట్ర చేసి పార్టీ నుంచి, కుటుంబం నుంచి దూరం చేశారని తెలిపారు. అలాంటి వారి గురించి కచ్చితంగా మాట్లాడుతానని చెప్పారు. ఇప్పుడే రాజకీయ పార్టీ గురించి ఆలోచన చేయటం లేదన్నారు. బిఆర్‌ఎస్ మూడోసారి ఓడిపోవటానికి కారణాల్లో తుమ్మలని వదులుకోవటం కూడా ఒక కారణమన్నారు. గతంలో తనను నిజామాబాద్‌కు మాత్రమే పరిమితం చేశారన్నారు. మళ్లీ తాము జాగృతిని బలోపేతం చేసుకుంటామని, ప్రజల కోసం పోరాటం చేస్తామన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రతిపక్షంగా విఫలమైందన్నారు. బీహార్‌లో ఘోరంగా ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఎలా గెలిచిందని, అంటే ప్రజల తరపున పోరాటం చేయాల్సినంత ప్రతిపక్షాలు చేయడంలేదని తెలిపారు. అందుకే జాగృతి సంస్థగా తాము ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్నారు. ఖమ్మంలో తాము మార్కెట్ సందర్శనకు వెళ్తామన్న రోజే బీఆర్‌ఎస్ వాళ్ళు వెళ్లేందుకు కార్యక్రమం పెట్టుకున్నారని, ఇన్ని రోజులు ఏమైంది? మేము రాగానే గుర్తుకు వచ్చిందా? అని ప్రశ్నించారు. ఎంతో చైతన్యం కలిగిన ఖమ్మం జిల్లా ప్రజలు తనకు మద్దతివ్వాలని కోరుతున్నానని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఏ పోరాటం వచ్చిన ఎర్రజెండా పార్టీలతో తాము కలిసి పనిచేస్తామని ప్రకటిస్తున్నానని అన్నారు.

జిన్నింగ్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం

- ఇద్దరు కార్మికుల సజీవ దహనం
- కార్మికుల ఆందోళన.. పోలీసుల మోహరింపు
- పరిశీలించిన ఎస్‌పి జానకి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిన్నింగ్ మిల్లులో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండల పరిధిలోని గొల్లపల్లి వద్ద ఉన్న సలసర్ బాలాజీ జిన్నింగ్ మిల్లులో మంగళవారం జరిగింది. వెంటనే జిల్లా ఎస్‌పి జానకి, పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. సహాయక చర్యలు చేపట్టారు. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణంగా భావిస్తున్నట్టు ఎస్‌పి తెలిపారు. ఎస్‌పి జానకి, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. సలసర్ బాలాజీ జిన్నింగ్ మిల్లులో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. మంగళవారం అకస్మాత్తుగా అగ్నిప్రమాదం జరిగింది. మంటలు ఎగసిపడ్డాయి. మిల్లులోని దుమ్ముధూళి బయటకు వెళ్లే పైపులైన్‌లో చెత్త ఇరుక్కుందని, దాన్ని తొలగించేందుకు ఒడిశా రాష్ట్రానికి చెందిన పప్పు(26), బీహార్ రాష్ట్రానికి చెందిన హరేందర్ (23) వెళ్లారు. ఈ క్రమంలో మంటలు ఒక్కసారిగా ఎగసిపడటంతో ఇద్దరు సజీవ దహనమయ్యారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. మృతులిద్దరికీ ఇటీవలనే వివాహమైంది. ఈ ఘటనతో కార్మికులు మిల్లు యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు మోహరించారు. కేసు దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియనుంది.

ఒక్కొక్కరికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య

బాలాజీ జిన్నింగ్ మిల్లు ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కంపెనీలో పని చేసే కార్మికులందరూ అంతర్రాష్ట్ర కార్మికులేనని, వారికి ఇఎస్‌ఐ, పిఎఫ్, క్యాంటీన్ సదుపాయం లేవన్నారు. కంపెనీ ఆవరణలో చిన్న చిన్న రేకుల షెడ్లు వేసి.. ఒక్కొక్క గదిలో 10, 12, మందిని ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 13, 14సంవత్సరాల పిల్లలతోనూ పని చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ రెండు మూడు సార్లు ఇలాంటి ప్రమాదాలు జరిగాయని, మార్చి 4, 2025న కూడా ప్రమాదం జరిగిందని తెలిపారు. దాదాపు 350 నుంచి 400 మంది కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. స్థానిక కార్మికులను ఇటీవల తొలగించారని తెలిపారు. కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సివిల్స్ ప్రోత్సాహకాలకు మరో అవకాశం

- దరఖాస్తు చేసుకోని వారికి 21 వరకు గడువు
- సింగరేణి సిఎండి ఎన్ బలరామ్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికై.. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం ప్రోత్సాహకానికి దరఖాస్తు చేసుకోని అభ్యర్థులకు మరో అవకాశం కల్పిస్తున్నట్టు సింగరేణి సిఎండి ఎన్ బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణకు చెందిన అభ్యర్థులు తమ వివరాలను ఈ నెల 21వ తేదీ లోపు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అందజేయాలని కోరారు. త్వరలో అర్హులందరికీ రెండో విడత రూ.లక్ష ప్రోత్సాహకాన్ని అందించనున్నట్టు వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా గతంలో మెయిన్స్‌కు ఎంపికై ఇప్పటికే రూ.లక్ష అందుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోనవసరం లేదని తెలిపారు. గతేడాది ప్రారంభించిన ఈ పథకం ద్వారా మొదటగా మెయిన్స్‌కు ఎంపికైన 140 మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేయగా.. వారిలో 20 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని బలరామ్ తెలిపారు. వారిలో ఏడుగురు విజేతలుగా నిలిచారనీ, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో టాపర్లుగా నిలిచిన 11వ ర్యాంకర్ కూడా ఇందులో ఉన్నారని వివరించారు. ఈ ఏడాది ప్రిలిమ్స్ పాసైన 202 మందికి ఆర్థిక చేయూత అందించగా..43 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని వెల్లడించారు.